క్లుప్తంగా

నేటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



మల్దకల్: మండల కేంద్రమైన మల్దకల్‌లోని శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి ఈనెల 17 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం సుప్రభాతసేవ, 8గంటలకు పంచామృతాభిషేకం, 14న కల్యాణోత్సవం, 15న పల్లకీ సేవ, 16న వీరబ్రహ్మేంద్రస్వామి వ్రతం, ఊరేగింపు, 17న స్వామి వారికి ప్రత్యేక పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఆదివారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడు పరిశీలించి తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, లిక్కర్, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రంలో కిటికీ అపహరణ



రాజోళి: మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో పోలింగ్ బూత్ కేంద్రానికి ఉన్న కిటికీని దుండగులు అపహరించారు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొన్ని మరమ్మతు పనులు చేపట్టారు. అందులో పోలింగ్ బూత్ నెంబర్ 150 ఏర్పాటు చేయగా, శనివారం రాత్రి పాఠశాల భవనానికి ఉన్న కిటికీని దుండగులు తొలగించారు. ఆదివారం ఉదయం భవనానికి కిటికీ లేకపోవడంతో స్థానికులు విస్తుపోయారు. ఓటర్లు తమ ఓటును గోప్యంగా వేసేందుకు వీలు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఏది ఏమైనా ఎన్నికల సమయంలో ఇలాంటి చర్యకు పాల్పడడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఎన్నికల నిబంధనలు ఇక్కడ వర్తించవా?



మానవపాడు: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో అధికారులు నిబంధనలు గాలికి వదిలేశారు. పార్టీ గుర్తులు ఓపెన్‌గా కనిపిస్తున్నా వాటిని కప్పి ఉంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ సంఘటన మండలంలోని చెన్నిపాడులో కనిపిస్తోంది. ప్రధాన పార్టీల గుర్తులు స్తంభాలకు కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల నిబంధనలు పాటించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

ఘనంగా మాతృదినోత్సవం



ధరూరు: ప్రపంచ మాతృ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంబీ షాలెం చర్చిలో మహిళలు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ సీపీ ప్రసాద్ యుధా, పాస్టర్ అమ్మలకు మహిళలకు కేక్ తినిపించారు. అంతకు ముందు పాస్టర్ మహిళా దినోత్సవానికి సంబంధించిన వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ దేవన, సంఘం పెద్దలు సుదర్శన్, ప్రభాకర్, జకరయ్య, మత్తయ్య, తిమోతి, నీరిక్షణ పాల్గొన్నారు.



అలంపూర్ చౌరస్తాలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది



ఈవీఎంలు, వీవీప్యాట్లతో వెళ్తున్న అధికారులు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నేడు పార్లమెంట్ ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎం, వీవీప్యాట్లు
- ఈవీఎంలలో దాగనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఓటు వినియోగించుకోనున్న 2,40,063 మంది ఓటర్లు
- నియోజకవర్గంలో 291 పోలింగ్ కేంద్రాలు

అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల సమరం చివరి ఘట్టానికి చేరుకుంది. అభ్యర్థుల భవితవ్యం నిర్ణయించే సమయం ఆసన్నమైంది. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌ను ఎన్నికల కమిషన్ నిర్వహిస్తోంది. అందులో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించేసుకోవడానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు వినియోగించే ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పోలింగ్ నిర్వహించే అధికారులకు అప్పగించారు. దీంతో ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడమే మిగిలింది. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ సంతోష్, ఎస్పీ రితు రాజ్‌లు పరిశీలించారు.

ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పంపిణీ

అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల సిబ్బందికి సామగ్రి అందజేశారు. గద్వాల ఆర్డీఓ రామచందర్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పోలింగ్ సిబ్బందికి అందజేశారు. యార్డులో 31 కౌంటర్లను ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఓంలు, వీవీప్యాట్‌లను, ఎన్నికల సామగ్రి ఎన్నికల నిర్వాహణ సిబ్బందికి అందజేశారు. ఎంపిక చేసిన ఆయా రూట్ మార్గాల్లో ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన బస్సుల్లో బయల్దేరగా పోలీసులు ప్రత్యేక వాహనాల్లో వారికి భద్రతగా వెళ్లారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పోలింగ్ నిర్వాహనకు 1400 మంది సిబ్బంది

అలంపూర్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వాహణకు 1400 మంది అధికారులు విధులు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఆర్డీఓ రామచందర్ తెలిపారు. 291 పోలింగ్ కేంద్రాల్లో పీఓలు–291 మంది, ఏపీఓలు– 291, ఓపీఓలు– 582 మంది రిజర్వుగా 236 మంది మొత్తం 1400 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ 54 మంది మైక్రో అబ్జర్వర్లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 31 రూట్లను ఏర్పాటు చేసి ఒక్కొక్క రూట్‌కు ఒక సెక్టోరియల్ అధికారిణి నియమించారు.

291 పోలింగ్ కేంద్రాలు

అలంపూర్ నియోజకవర్గంలో ఈ సారి ఎన్నికలకు 291 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇటిక్యాలలో 49, అయిజలో 80, వడ్డేపల్లి 30, రాజోళి 33, మానవపాడు 34, ఉండవెల్లి 29, అలంపూర్ 36 మొత్తం 291 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలంపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా అయిజ మండలంలో 80 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అత్యల్పంగా ఉండవెల్లిలో 29 కేంద్రాలున్నాయి. అలంపూర్ మండలంలో కొత్తగా ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టనున్నారు.

2,40,063 మంది ఓటర్లు

పార్లమెంట్ ఎన్నికల్లో 2,40,063 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో పురుష ఓటర్లు 1,18,391 మంది మహిళా ఓటర్లు 1,21,662 మంది ఇతరులు 10 మంది ఉన్నారు. ఇటిక్యాలలో 41,796 మంది, అయిజలో 68,260 మంది, వడ్డేపల్లిలో 27,044 మంది, రాజోళిలో 27,932 మంది, మానవపాడులో 25625 మంది, ఉండవెల్లిలో 22,492 మంది, అలంపూర్‌లో 26,914 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



అలంపూర్ చౌరస్తాలోని పంపిణీ కేంద్రం వద్ద పోలింగ్ అధికారులు కోసం సిద్ధంగా ఉన్న బస్సులు, ప్రైవేట్ వాహనాలు



పంపిణీ కేంద్రాల నుంచి బయల్దేరుతున్న బస్సులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామచందర్

హీటెక్కుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- వేసవిలో పెరిగిన విద్యుత్ వినియోగం
- ట్రాన్స్‌ఫార్మర్లపై అధికలోడు
- మరమ్మతు చేసేందుకు ఆపసోపాలు

అయిజ: ఎండ వేడికి తాలలేక ప్రజలు ఏసీలు, కూలర్లు అమర్చుకున్నారు. ఫ్యాన్లు 24 గంటలు తిరుగుతూనే ఉన్నాయి. వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగింది. ట్రాన్స్‌ఫార్మర్లు లోడ్ పడుతున్నాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు హీటెక్కుతున్నాయి. మరి కొన్ని చోట్ల పేలిపోతున్నాయి. వాటికి మరమ్మతు చేసేందుకు విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆపసోపాలు పడుతన్నారు. అనేక సార్లు ఎల్‌సీలు తీసుకోవాల్సి వస్తోంది. దాని వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం..

సాంకేతికత రోజురోజుకు అభివృద్ధి చెందుతుండడంతో ప్రతి పనికి కరెంట్‌ను ఉపయోగించుకొని చేసే పనిముట్లు, యంత్రాలు, వస్తువులు వచ్చాయి. చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారం చేసేవారి వరకు, చివరికి కుల వృత్తులు చేసేవారికి ప్రతి ఒక్కరికి విద్యుత్ వినియోగం తప్పనిసరి అయ్యింది. నివాస గృహాల్లో విద్యుత్ అవసరం మరింత ఎక్కువైంది. ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి టీవీలు చూడడం తప్పనిసరి, ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్లు, కరెంట్ కుక్కర్లు పనిచేయాలంటే తప్పనిసరిగా విద్యుత్ అవసరమే. రాత్రి సమయంలో కరెంట్ బల్బులు వెలగాలంటే విద్యుత్ సరఫరా ఉండాల్సిందే. వేసవిలో 40 సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండడంతో నివాస గృహాల్లో, వ్యాపార సంస్థల్లో కూలర్లు, ఏసీల వినియోగం ఎక్కువైంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన విద్యుత్ సరఫరాకు ప్రతినిత్యం అంతరాయం కలుగుతుంటే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

లోడ్ పడుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

మండలంలో మొత్తం 148 ట్రాన్స్ ఫార్మర్‌లు ఉన్నాయి. వేసవిలో విద్యుత్ వినియోగం రెండింతలు కావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు లోడ్ పడుతున్నాయి. దాని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు హీటెక్కుతున్నాయి. ఫీజులు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు చెలరేగుతున్నాయి. దాని వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌లు చాలా చోట్ల పనిచేయడంలేదు. కొన్ని ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు పనిచేస్తున్నా, వాటిని ఉపయోగించడంలేదు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఏబీ స్విచ్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను తొలగించి నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా జరిగే విధంగా చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ సరఫరాను నిలిపేయాలంటే లైన్‌మెన్లు, హెల్పర్లు సబ్‌స్టేషన్‌లోని సిబ్బందికి ఫోన్‌చేసి ఎల్‌సీ తీసుకోవల్సి ఉంటుంది. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపేయడంతో పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

సిబ్బందికి ఇబ్బందులు..

వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువ కావడంతో విద్యుత్ పరికరాలు మొరాయిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతున్నాయి. ఫీజులు కాలిపోతున్నాయి. అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌లు పేలిపోతున్నాయి. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఓవర్ లోడ్‌ను తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుతున్నారు. అవసరమైన చోట నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎర్త్ వైర్లకు నీళ్లు పోస్తున్నారు. అర్ధరాత్రి అపరాత్రి తేడా లేకుండా విద్యుద్ సిబ్బంది కష్టపడాల్సి వస్తోంది. విద్యుత్ వినియోగానికి సరిపడేవిధంగా పట్టణంలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్న విద్యుత్ సిబ్బంది



ట్రాన్స్ ఫార్మర్‌ను తరలిస్తున్న సిబ్బంది

ఎర్త్ వైర్లకు నీరు పోయాలి



ఎండలు ఎక్కువగా ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు హీటెక్కుతున్నాయి. అనుకోకుండా విద్యుత్ సరఫరా ఎక్కువగా వస్తుంది. వేసవిలో ఎర్త్ వైర్లకు నీళ్లు పోయకపోవడంతో విద్యుత్ సరఫరా కంట్రోల్ తప్పుతోంది. ఇండ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయి. విద్యుత్ సిబ్బంది తరుచూ ఎర్త్ వైర్లకు నీళ్లు పోస్తూ ఉండాలి.

– ఖాజ, అయిజ

అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలి



విద్యుత్ వినియోగం రోజురోజుకు ఎక్కువవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్‌లపై ఓవర్ లోడ్ పడుతుంది. దానివలన ట్రాన్స్‌ఫార్మర్‌లు ట్రిప్ అవుతున్నాయి. విద్యుత్ పరికరాలు హీటెక్కి కాలిపోతున్నాయి. ఓవర్ లోడ్‌ను తగ్గించేందుకు పట్టణంలో సరిపడినన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ అమర్చాలి.

– నాగరాజు, అయిజ

సమస్యలను పరిష్కరిస్తున్నాం



విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిస్కరిస్తున్నాం. వేసవిలో విద్యుత్ వినియోగం పెరగడంతో పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఓవర్ లోడ్ అవుతున్నాయి. అవి అండర్ లోడ్ అయ్యేటట్లు చర్యలు తీసుకున్నాం. పట్టణంలో అక్కడక్కడ 10 ట్రాన్స్‌ఫార్మర్లను డైవర్షన్ చేశాం. ఎస్సీ కాలనీలో ఒకటి, భరత్ నగర్‌లో రెండు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను కొట్టివేయించాం. అర్ధరాత్రి వినియోగదారులు ఫోన్ చేసినా సరే స్పందిస్తున్నాం. మెరుగైన విద్యుత్ సేవలందించేందుకు నిరంతరం పనిచేస్తాం.

– నరేందర్ రెడ్డి, విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ

గ్రామాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

గట్టు: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఈవీఎంలతో పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో మొత్తం 55 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 47,194 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 23,120 మంది, స్త్రీలు 24,073 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటుగా పోలీస్ బలగాలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభించి, సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 6 మంది సెక్టోరియల్ అధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు. గట్టులో 101,102 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసిన కేంద్ర ప్రాథమి పాఠశాలను మాడల్ పోలింగ్ కేంద్రంగా ప్రత్యేక ఆకర్షణతో ఏర్పాటు చేశారు.

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోసం విధులు నిర్వహించేందుకు అధికారులు సాయంత్రం వరకు అన్ని గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లో ఎన్నికల నేపథ్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. మండలంలోని మొత్తం 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ షాహిదాబేగం అన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్లు తప్పని సరిగా గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రానికి తేవాలని పేర్కొన్నారు. ఫొటో, గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఏదైనా గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రానికి తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ధరూరు: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పోలింగ్ సంబంధించి మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 28 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు తహసీల్దార్ నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారని, మండల వ్యాప్తంగా 41,796 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ బూతులకు సిబ్బంది చేరారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని సిద్ధం చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



గట్టులో గేటు దగ్గర బెలూన్లతో ముస్తాబు చేసిన పోలింగ్ కేంద్రం



ఇర్కిచేడు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది, పోలీసు బలగాలు



ధరూర్‌లో ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది



ఉండవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఎంపీడీఓ

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోదండాపురం ఎస్ఐ స్వాతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు, ఓటర్లకు పోలీసులు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటారని, ఎక్కడైనా ఓటర్లు ఇబ్బందులకు గురైనా లేక ఇతరులు ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆమె పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

మానవపాడు: మండలంలోని 16 గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆదివారం ఎస్ఐ చంద్రకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

ఖిల్లాఘనపురం: మండల పరిధిలోని సోళీపురానికి చెందిన నరేష్(22)కు కొన్ని రోజులుగా కాళ్లకు ఇన్‌ఫెక్షన్ కావడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో మృతుడి మిత్రులు వాల్మీకి సంఘం యువత ముందుకు వచ్చి ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. మృతుడి కుమార్తె పేరున ఎస్‌బీఐలో ఖాతా ఓపన్ చేసి కొంత నగదును జమ చేస్తామన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మృతుడి మిత్రులు చెన్నకేశవులు, ఆంజనేయులు, తిలక్, నరసింహ, యాదగిరి, పరశురాం, రామస్వామి, రాజు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



సోళీపురంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నగదును అందజేస్తున్న మిత్రులు

హజ్ యాత్రికులకు సన్మానం

ఆత్మకూర్: హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను ముస్లింలు ఘనంగా సత్కరించారు. ఆదివారం మస్జీదే సయ్యదియాలో హజ్‌యాత్రకు వెళ్తున్న అఫ్తాబ్, అజ్హర్‌లను మస్జీద్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా హఫీజ్ అజ్హర్‌అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖలీల్, అన్వర్, రఫీక్, మస్తాన్, ఫెరోజ్, అహ్మద్, మునీర్, హనీఫ్, నజీర్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో హజ్ యాత్రికులను సన్మానిస్తున్న ముస్లింలు


ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిశంకరాచార్యులు 7 సంవత్సరాల వయస్సులోనే వేదాలను అధ్యయనం చేసి, మహాజ్ఞాని అయ్యాడని తెలిపారు. ఇంటిని వదిలి వెళ్లి 16 సంవత్సరాల వయస్సు నాటికి తన రచనలను పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో పల్లా శ్రీనివాసులు, ఆశన్న, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: పట్టణంలోని భాస్కరదేవ్ నిలయంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈమేరకు.. స్వామివారి చిత్రపటానికి పూజలు చేశారు. శ్రీ శంకర సేవా సమితి ఆధ్వర్యంలో పల్లకిసేవా, రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా మంగళ హారతి, స్వస్తివచనం, శ్రీశారద భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం ప్రముఖ కవి రామ్మోహన్‌రావు ఆధ్యాత్మిక బోధనలను వివరించారు. కార్యక్రమంలో సీతారామ్‌దీక్షిత్, కుమ్మన్నశాస్త్రీ, వెంకు, దేవానంద్, మహేష్, శివానంద్‌పురోహిత్, విద్యాధర్, ధరణీధర్, గోపాలచారి పాల్గొన్నారు.



ఆదిశంకరాచార్య జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోపి తదితరులు



జగద్గురు ఆదిశంకరాచార్యుల చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు